
సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



తాళ్లపాకపై కరుణ!

సులువైన పదాల నుతిమెత్తని కీర్తనలు ఆలపించిన అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధి దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి అడుగులు పడుతున్నాయి. -8లో



గాయపడిన యువకుడి మృతి

బార్లపల్లె వద్ద నాలుగురోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరీష్ చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.98	రూ.120
రెండోరకం	రూ.56	రూ.94

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 162 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	335	440
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 2,102.360 కిలోలు

న్యూస్‌రీల్

నూతన నియామకం



కె. జగదీష్‌రెడ్డి

రాయచోటి టౌన్: జిల్లా ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్‌గా కె.జగదీష్‌రెడ్డిని నియమించింది. ఈమేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) శాఖ వారి నుంచి బుధవారం ఆదేశాలు అందాయని చెప్పారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకరించిన ఎమ్మెల్యే, ఎంపీలకు కృతజ్ఞతలు తెలియచేశారు.

టెట్ అభ్యర్థులకు శిక్షణ

రాయచోటి టౌన్: టెట్ (టీచర్ ఎలిజిబిలిటి టెస్టు) రాస్తున్న అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల, రాజంపేటలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లెలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో టీటీసీ, బీఈడి పూర్తి చేసిన అభ్యర్థుల కోసం ఈ నెల 27వ తేదీ నుంచి మార్చి 6 వరకు అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాయచోటిలో ఉదయం సెషన్‌కు 350 మందికి 298 మంది, మధ్యాహ్నం సేషన్‌కు 348 మందికి 303 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సీమాంక్ డైరెక్టర్ మస్తానయ్య, జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి, ఎంఈవో బాలాజీ నాయక్‌లు శిక్షణను పర్యవేక్షించారు.

శ్రీరామ మందిరం నిర్మాణానికి ఎంపీ విరాళం



ఎంపీ మిథున్‌రెడ్డి అందించిన విరాళాన్ని తీసుకుంటున్న సర్పంచ్ కృష్ణవేణి

కేవీపల్లె: మండలంలోని సుగాలితాండా పంచాయితీలో శ్రీరామ మందిరం నిర్మాణానికి రాజంపేట్ ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ. 2 లక్షలు విరాళం అందజేసినట్లు సర్పంచ్ కృష్ణవేణి తెలిపారు. బుధవారం పీలేరు, కేవీపల్లె ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రామ మందిరం నిర్మించడానికి ఎంపీ సహకారం అందించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌నాయక్, గ్రామ సచివాలయ కన్వీనర్ చంద్రానాయక్, నాయకులు దినేష్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల పరష ప్రారంభం



రూ.2 లక్షలు పలికిన ఎద్దులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం నలవీరగంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎద్దుల పరష ప్రారంభమైంది. ఆలయం సమీపంలోని మైదానంలో పరషను సర్పంచ్ ఆనందపార్థసారధి ప్రారంభించారు.పరషకు మదనపల్లె, వాల్మీకిపురం, తంబళ్లపల్లె, పీలేరు, కురబలకోట ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో ఎద్దులను తీసుకువచ్చారు. రైతులు ఎద్దుల కొనుగోలు చేశారు. శానిటోరియంకు చెందిన ఓ రైతు రూ. రెండు లక్షలు విలువ చేసే ఎద్దులను కొనుగోలు చేశారు.దీంతో పాటు రెండు జతల ఎద్దులు రూ.1.60 లక్షలు పలికింది. లక్షలు పెట్టి రైతులు ఎద్దులను కొనుగోలు చేశారు. ఎద్దుల పరషకు కావాల్సిన నీరు, ఇతర సౌకర్యాలను పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ఎద్దుల పరష మార్చి 3 వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం దోపు తిరునాల నిర్వహించారు.

విద్యార్థి దశ నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి

రాయచోటి: జిల్లాలో చేపట్టిన ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశానుసారం రాయచోటి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ అందజేశారు. అంతకు ముందు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పొదుపును అలవరచుకోవాలని సూచించారు.

రూపుమారింది.. వన్నెలద్దుకుంది

- అన్నమయ్య జిల్లా కేంద్రంలో వేగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- ఇప్పటికే అన్నిచోట్ల పూర్తయిన ఎంఐజీ లేఅవుట్ల పనులు
- విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ కేంద్రీయ విద్యాలయాలు
- చకాచకా శిల్పారామం పనులు



అందంగా రూపుదిద్దుకున్న ఆర్అండ్‌బీ అతిథిగృహం

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి అభివృద్ధివైపు పయనిస్తోంది. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో భాగంగా అన్ని రంగాల్లో రాయచోటిని తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పన మొదలుకొని ప్రజల ఆహ్లాదం, ఆటలు ఇలా అన్ని రంగాల్లో పురోగతిబాట పట్టించారు. ఒకవైపు అభివృద్ధి పనులు వేగం పుంజుకోగా, మరోవైపు పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలతో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. నాటికీ, నేటికీ తేడా చూస్తే జిల్లా ఏర్పడిన కొద్దిరోజుల్లోనే మార్పు ఇట్టే అర్థమవుతోంది.

రూపుదిద్దుకున్న అతిథిగృహం

జిల్లా కేంద్రమైన రాయచోటిలో చాలా రోజులుగా అతిథిగృహం లేక ఉన్నతాధికారులు మొదలుకొని వీఐపీలకు ఇబ్బందులు తప్పవి కావు. జిల్లా పర్యటన నిమిత్తం వచ్చినా...ఇతర కారణాలతో అధికారులు రాయచోటిలో అగినా ప్రభుత్వ అతిథి గృహం లేకపోవడంతో రాత్రి పూట బస చేసేందుకు అటు హార్సిలీహిల్స్ వైపు, ఇటు కడపకు వెళ్లేవారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల ప్రత్యేక కృషితో జిల్లా కేంద్రంలో అతిథి గృహం రూపుదిద్దుకుంది. కడప–చిత్తూరు జాతీయ రహదారి పక్కన రాయచోటిలోని కలెక్టరేట్‌కు సమీపంలో సుమారు రెండు ఎకరాల్లో రూ. 1.40 కోట్లతో అద్భుతంగా ఆర్అండ్‌బీ అతిథిగృహాన్ని నిర్మించారు.

తలమానికంగా మహనీయుల విగ్రహాలు

రాయచోటిలోని జాతీయ రహదారి ప్రాంతంలో మహనీయుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కలెక్టరేట్ సమీపంలోనే జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అక్కడే 102 అడుగుల స్థూపంపై అతి పెద్ద జాతీయ జెండా ఎగిరేలా ఏర్పాటు చశారు. ఇది రాయచోటికే తలమానికంగా నిలుస్తోంది. పలు సర్కిళ్లలో అన్నమయ్య, జ్యోతిరావుపూలే, బీఆర్ అంబేడ్కర్, ఏపీజే అబ్దుల్ కలాం, వాల్మీకి మహర్షి విగ్రహాలు పెడుతున్నారు. సర్కిళ్లను కూడా విస్తరిస్తుండడంతో రాయచోటి రూపురేఖలే మారిపోయాయి.

ఆకట్టుకునేలా పోలీసు పరేడ్‌గ్రౌండ్

అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత పోలీసులు వ్యాయామం చేసుకోవడానికి, ఇతర కార్యకలాపాల నిర్వహణకు మైదానం లేని పరిస్థితి. జిల్లాలో గతంలో పనిచేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు నేతృత్వంలో ప్రత్యేకంగా కొండ ప్రాంతంగా ఉన్న ప్రదేశాన్ని రూపు మార్చారు. మూడు నెలలపాటు రేయింబవళ్లు, జేసీబీలు, టిప్పర్లతో రాళ్లను కొట్టి, మట్టిని తోడారు. గుట్ట ప్రాంతాన్ని చదును చేశారు. ప్రస్తుత ఎస్పీ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసు కార్యాలయ ముందుభాగాన ఏర్పాటు చేసిన నిర్మాణాలతోపాటు చుట్టూ పచ్చని చెట్లతో కొత్త అందాలను సంతరించుకుంది. పోలీసు పరేడ్ గ్రౌండ్ ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచే స్థాయిలో తీర్చిదిద్దారు.

ఆటలకు స్టేడియం...ఆహ్లాదానికి శిల్పారామం

జిల్లా కేంద్రంలో ఆటలకు సంబంధించి స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కోట్లాది రూపాయలు వెచ్చించి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించారు. మరోవైపు ప్రజల ఆహ్లాదానికి సంబంధించి రింగ్ రోడ్డు సమీపంలో సుమారు 13 ఎకరాల్లో శిల్పారామం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ. 8 కోట్ల వ్యయంతో అద్భుతంగా రూపొందించి ఆహ్లాదాన్ని పంచేలా పథక రచన చేశారు. రాయచోటిలో డీఎస్పీ కార్యాలయంతో పాటు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి తెచ్చారు.

రహదారులకు మహర్దశ

రాయచోటిలో రోడ్లకు మహర్దశ పట్టింది. రాయచోటిలోని సుండుపల్లె రోడ్డుకు సంబంధించి మెయిన్‌రోడ్డు (ఠాణా) నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ఫోర్‌లేన్ రహదారి సుమారు రూ. 16 కోట్లతో తీర్చిదిద్దారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో పాటు విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డిల చొరవతో వేగంగా పనులు పూర్తయ్యాయి. రాయచోటిలోని గునికుంట్ల రోడ్డుకు సంబంధించి పట్టణం నుంచి రింగ్ రోడ్డు వరకు డబుల్ లైన్ రోడ్డును నిర్మించారు.



జాతీయ రహదారి మధ్యలో డివైడర్ల నిర్మాణం

సుమారు రూ. 4.15 కోట్లతో నిర్మించిన ఈ రహదారిని రెండు లేన్లతోపాటు కొంతమేర ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీ నీటికి సంబంధించి ఏర్పాట్లు చేశారు.

మధ్యతరగతి ప్రజలకు ప్లాట్లు

అన్నమయ్య జిల్లాలో మధ్యతరగతి ప్రజలకు సంబంధించి ప్లాట్లు అందించేందుకు ఎంఐజీ లేఅవుట్లను సిద్ధం చేశారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే స్థలాలను ఎంపిక చేసి ప్లాట్లు వేసే కార్యక్రమం కూడా జరుగుతోంది. రాయచోటిలో మాత్రం రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పైపులైన్ పనులు పూర్తవుతున్నాయి. మధ్యతరగతి ప్రజల స్వంతింటి కలను సాకారం చేస్తున్నారు. రాయచోటిలో ఇప్పటికే సుమారు 50 ఎకరాల్లో లే అవుట్లు వేసి ప్రజలకు అందించగా, మరో 25 ఎకరాల్లో ప్లాట్లను సిద్ధం చేస్తున్నారు.



మధ్యతరగతి ప్రజల ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన ఎంఐజీ లే అవుట్

మురాద్‌బీకుంటలో ఆక్రమణల తొలగింపు



మురాద్‌బీ కుంటలో జేసీబీలతో సరిహద్దు కందకాలు తవ్విస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా మురాద్‌బీ కుంటలో టీడీపీనేతలు చేపట్టిన ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కబ్జాకోరులు...టీడీపీనేతలే కథనంపై అధికారులు స్పందించారు. ఉప తహసీల్దార్ వెంకటస్వామి ఆధ్వర్యంలో కండ్రిగ గ్రామంలోని మురాద్‌బీ కుంట ఆక్రమణలపై విచారణ నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వేనంబరు 16/1లో 3.37 ఎకరాల్లో మురాద్‌బీ కుంట విస్తరించి ఉంది. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం సదరు స్థలం విలువ రూ. ఆరు కోట్ల వరకు ఉంటుంది. అయితే టీడీపీలోని రెండువర్గాలు పోటీపడి మరీ సుమారు 3 ఎకరాల మురాద్‌బీ కుంటను ఆక్రమించేశారు. ఈనేపథ్యంలో మండల సర్వేయర్ రెడ్డిశేఖర్ తమ సిబ్బందితో కుంట మొత్తాన్ని సర్వేచేశారు. సర్వేలో కుంట ఆక్రమణలకు గురైందన్న వాస్తవాలు వెలుగుచూశాయి. ముందుగా కుంట చుట్టూ సరిహద్దులను గుర్తించారు. కుంటకు సగంవైపు ఉన్న ఆక్రమణలను జేసీబీలతో తొలగించారు. కొలతల ప్రకారం కుంట విస్తరించి ఉన్న మేరకు కందకాలను తవ్వించారు. ఓవర్గం వారు ఆక్రమించుకొన్న ఆక్రమణలను తొలగించారు. ఇంకా మరో వర్గంవారు ఆక్రమించుకొన్న ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. వాటిని కూడా తర్వలోనే తొలగించి జేసీబీలతో కందకాలు తవ్విస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఇంతియాజ్, విలేజ్ సర్వేయర్లు నందినీ, సాజిద్‌లు పాల్గొన్నారు.

రూ. 3.85 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం

ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



టీటీడీ కల్యాణ మండపం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తదితరులు

రాయచోటి: పేద, మధ్యతరగతి ప్రజల వివాహ, ఇతర శుభకార్యక్రమాల నిమిత్తమే రాయచోటిలో టీటీడీ కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి–చిత్తూరు రహదారిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన రూ. 3.85 కోట్ల నిధులతో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపాన్ని మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డి, గొర్ల రమేష్ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ శ్రీధర్ రెడ్డిలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి పట్టణ పరిధిలో 1.65 ఎకరాల విస్తీర్ణంలో రూ. 3.85 కోట్ల నిధులతో టీటీడీ కల్యాణ మండపం అందుబాటులోకి రావడం హర్షనీయమన్నారు. ఫంక్షన్ హాల్, డైనింగ్ హాల్, 8 వసతి గదులను అధునాతన వసతులతో, ఏసీ సౌకర్యంతో నిర్మించినట్లు చెప్పారు. టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేసి సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డికి, టీటీడీచైర్మన్, ఈఓలకు శ్రీకాంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. టీటీడీ ఈఈ సుమతి, డిప్యూటీ ఈఈ నాగరాజు, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, వైఎస్సార్‌సీసీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర, డీసీబీ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు,జేసీఎస్ కో– కన్వీనర్ అమరనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు

రాయచోటి: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రైతులకు సొంత భూమి లేని కౌలు రైతులకు 'వైఎస్ఆర్ రైతు భరోసా–పీఎం కిసాన్'5వ ఏడాది, 3వ విడత ఆర్థికసాయంతో పాటు, రబీ 2021–22, ఖరీఫ్ –2022కు సంబంధించి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ మొత్తాన్ని కంప్యూటర్ బటన్‌నొక్కి రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్, ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అతిథులతో కలిసి జిల్లాలో 'వైఎస్ఆర్ రైతు భరోసా – పీఎం కిసాన్'కు సంబంధించి 2,05,806 మంది రైతులకు రూ.41.26 కోట్లు, 28,550 మంది రైతులకు రూ.7.639 కోట్ల మేర వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. 2023–24 సీజన్‌కు సంబంధించి 3వ విడత పెట్టుబడి సాయాన్ని ఒకేసారి రైతులకు అందజేయడం అభినందనీయమన్నారు. అర్హత ఉండి 'వైఎస్ఆర్ రైతు భరోసా'పథకం లబ్ధి పొందని వారుంటే.. సంబంధిత వార్డు లేదా గ్రామ వలంటీర్లు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో బంగారు భవిత

- పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల
- పదో తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం





మదనపల్లెలోని ప్రభుత్వ జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ

మదనపల్లె సిటీ: పదో తరగతి విద్యార్హతతో సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిసెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. మార్చి 18వతేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు ఫిబ్రవరి నెలలోనే పాలిసెట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు, సాంకేతక నిపుణులు సూచిస్తున్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉపయుక్తం

గ్రామీణ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ వంటి అత్యున్నత సాంకేతిక చదువులను అందుకోవాలంటే ఎక్కువ ఖర్చుతో కూడుకున్న పని. వీరికి తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే దానిని పునాదిగా చేసుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి పాలిటెక్నిక్ కోర్సులు వేదికగా నిలుస్తాయి. పాలిసెట్–2024 కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఏప్రిల్ 5వ తేదీ పాలిటెక్నిక్ కోర్సులకు నిర్వహించే పాలిసెట్ దరఖాస్తుకు తుది గడువు.

కోర్సుల వివరాలు:

పాలిటెక్నిక్ కోర్సులను ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్ అండ్ కంప్యూటర్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. జిల్లాలో మదనపల్లె (జీఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజీ), రాయచోటి, రాజంపేట, కలికిరి, ఓబులవారిపల్లెలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు నడుస్తున్నాయి. దీంతో పాటు మదనపల్లె సమీపంలోని గోల్డన్‌వ్యాలీ ఇంజినీరింగ్ కాలేజీ, పీలేరులోని ఎంజెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సు కాలవ్యవధి మూడు సంవత్సరాలు. ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునే శిక్షణ సైతం ఇస్తారు. పాలిసెట్ ఎంట్రన్స్‌లో క్వాలిఫై మార్కులు 35 గా నిర్ణయించారు.

- పాలిసెట్ పరీక్షను 120 మార్కులకు నిర్వహిస్తారు. వీటిలో గణితం 50, ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 30 మార్కులకు ఉంటుంది. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుంది. ఈ ఏడాది మే 10న పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష జరుగుతుంది. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ,బీసీ విద్యార్థులు రూ.400 పరీక్ష ఫీజు కట్టాలి.

పరీక్షల షెడ్యూల్



దరఖాస్తుకు గడువు: ఏప్రిల్ 5
ప్రవేశ పరీక్ష: ఏప్రిల్ 27
ఫలితాలు: మే 25
కౌన్సెలింగ్: జూన్ నాలుగో వారం నుంచి

ఎన్నో ప్రయోజనాలు: పాలిటెక్నిక్‌లో కోర్సును పూర్తి చేసినా ఉద్యోగం, ఉపాధి సులభంగా దొరుకుతుంది. ఈ కళాశాలల్లో ఇటీవల తరచూ ఉద్యోగ మేళాలను నిర్వహిస్తున్నారు. ఆయా కంపెనీల ప్రతినిధులు వచ్చి విద్యార్థులను ఎంపిక చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సుచేయడానికి మూడేళ్లకు కేవలం రూ.13 వేలు ఖర్చువుతుంది. తర్వాత ఇంజనీరింగ్ సెకండియర్‌లో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ చేస్తే చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధికి తోడ్పడుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–ఓబులేసు, ప్రిన్సిపాల్, జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ,మదనపల్లె

గంగజాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రంగస్వామి, డీఎస్పీ మహబూబ్ బాషా

లక్కిరెడ్డిపల్లి: మార్చి 11,12వ తేదీల్లో జరిగే గంగమ్మజాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గంగమ్మ దేవత ఆలయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గంగమ్మ జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర ముగిసేవరకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. జాతరలో అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు జరగకుండా చూడాలని ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు. జాతరలో భాగంగా చాందినీ బండ్ల ఊరేగింపులలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఎక్కడికక్కడ ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీ రెడ్డన్న, సీఐ జీవన్ గంగనాథ బాబు, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, కమిటీ సభ్యులు రెడ్డయ్య, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, ఆలయ ఈఓ రవీంద్రరాజు, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజబాబు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురికి గాయాలు

సంబేపల్లె : మండల పరిధిలోని కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి నారాయణ రెడ్డిపల్లె సచివాలయం సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనాలు ఢీ కొని నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు రాయచోటి ఇందిమ్మ కాలనీకి చెందిన కుశల్ నాయక్, మహేష్ రాజులు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రాయచోటి కొత్తపేట రామాపురానికి చెందిన రెడ్డి శివ, రెడ్డి సాయిలు ద్విచక్ర వాహనంలో వెళ్తూ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్నారు. దీంతో నలుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్త అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పీలేరురూరల్ : భార్యపై హత్యాయత్నం కేసులో భర్తను అరెస్టు చేసినట్లు సీఐ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 25న మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లెకు చెందిన బొజ్జ గురవయ్య తన భార్య అనితపై అనుమానంతో ఇనుప రాడ్డుతో కొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించాడు. ఆమె తలకు బలమైన గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు గురవయ్యను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరసింహులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకట్రమణ

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోట బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెంకట్రమణ (60) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. బురకాయలకోట పంచాయతీ రెడ్డివారిపల్లికి చెందిన మృతుడు వెంకట్రమణ సీటీఎం జాతరకు వెళ్లి బుధవారం ఉదయం బురకాయలకోటకు బస్సులో వచ్చాడు. అక్కడి నుంచి కాలి నడకన వారి స్వగ్రామమైన రెడ్డివారిపల్లికి వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అటు వైపు వెళుతున్న స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

తాళ్లపాకపై కరుణ!

- భూమన హయాంలో జన్మస్థలి అభివృద్ధికి అడుగులు
- తాళ్లపాకలో రూ.2కోట్లతో కళామందిరం నిర్మాణం
- తాళ్లపాకలో నిత్యం సంకీర్తనార్చనకు శ్రీకారం
- తాజాగా టీటీడీ పాలకమండలిలో తీర్మానం
- ఒక్కొక్కటి నెరవేరుతున్న వైఎస్సార్ హామీలు

రాజంపేట : అదివో..అల్లదివో..శ్రీహరివాసము..బ్రహ్మకడిగిన పాదము..అంటూ సులువైన పదాల సుతిమెత్తని కీర్తనలు ఆలపించిన అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధి దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అడుగులు పడుతున్నాయి. తాళ్లపాకపై టీటీడీ కరుణ చూపింది. అన్నమాచార్యుని 600వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన 108 అడుగుల అన్నమయ్య విగ్రహావిష్కరణకు నాడు విచ్చేసిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధికి సంబంధించి హామీలను ప్రకటించిన సంగతి విదితమే. ఆ హామీలు అమలుచేసే విధంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి.

మహానేత మరణం తర్వాత..

మహానేత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తర్వాత అన్నమయ్య జన్మస్థలిలో ఉన్న అన్నమయ్య థీంపార్కు(108 అడుగుల అన్నమయ్య విగ్రహ ప్రాంతం) అభివృద్ధి అటకెక్కించేశారు ఆనాటి పాలకులు. అప్పటి టీటీడీ పాలకమండలి తాళ్లపాక, అన్నమయ్య థీంపార్కు అభివృద్ధికి సంబంధించి నిధులు కేటాయింపులు కానీ, ఇతరత్రా అభివృద్ధి ఊసెత్తలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధిపై దృష్టి సారించింది. ఒక్కొక్కటిగా హామీలు అమలవుతున్నాయి.

దశాబ్దంన్నర తర్వాత థీంపార్కులో శ్రీవారి ఆలయం..

అన్నమయ్య ఉద్యానవనంలో దశాబ్దంన్నర తర్వాత (14 ఏళ్లు) మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి బీజం పడింది. అప్పట్లో ఎంపిక చేసిన స్థలంలో శ్రీవారి ఆలయం నిర్మించారు. టీటీడీ రూ.కోటికిపైగా వ్యయం చేస్తోంది. ఈ



కళామందిరం నిర్మించనున్న అన్నమయ్య ధ్యానమందిరం

మార్గంలో తిరుమలకు వెళ్లే దక్షిణభారత యాత్రికులకు ముందుగానే అన్నమయ్య జన్మస్థలిలో శ్రీవారిని దర్శించుకోవడం మహానందంగా భావిస్తున్నారు. తాళ్లపాక, 108 అడుగుల విగ్రహం ప్రాంతం పార్కును టీటీడీ అటవీశాఖ సిద్ధం చేసింది. ఆలయం నిర్మాణం పూర్తి కావడంతో త్వరలో ప్రారంభానికి టీటీడీ సన్నద్ధమవుతోంది.

రూ.2కోట్లతో అన్నమయ్య కళామందిరం

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి తాళ్లపాకలో నూతనంగా రూ.2కోట్లతో అన్నమయ్య కళామందిరం నిర్మించాలని తీర్మానం చేసింది. చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. పాడుబడిన అన్నమయ్య



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆవిష్కరించిన 108 అడుగుల అన్నమయ్య విగ్రహం

ధ్యానమందిరం స్థానంలో అన్నమయ్య కళామందిరం నూతనంగా నిర్మించనున్నారు. కాగా గతంలో అన్నమయ్య ధ్యానమందిరం కూలిపోయే దశలో ఉందని 'సాక్షి'లో కథనాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నూతనంగా కళామందిరం నిర్మితం చేసిన తర్వాత నిత్యం సంకీర్తనార్చన కార్యక్రమం నిర్వహించాలని టీటీడీ పాలకమండలి తీర్మానం చేసింది.

తాళ్లపాకకు మహర్దశ



అన్నమయ్య జన్మస్థలి అయిన తాళ్లపాక అభివృద్ధిపై టీటీడీ దృష్టి సారించింది. శిథిలావస్థలో ఉన్న ధ్యానమందిరం పునర్ నిర్మించాలని గతంలో టీటీడీ అధికారులను కోరుతూ వచ్చాము. తాజాగా అన్నమయ్య ధ్యానమందిరం స్థానంలో నూతనంగా కళామందిరం నిర్మించాలని టీటీడీ పాలకమండలి తీర్మానం చేయడం శుభపరిణామం. భూమన నిర్ణయం ప్రశంసనీయం. తాళ్లపాక వాసుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

– శ్యామనబోయిన గౌరీశంకర్, సర్పంచ్, తాళ్లపాక

వైఎస్సార్ హామీలను నెరవేరుస్తున్న టీటీడీ



108 అడుగుల అన్నమయ్య విగ్రహం ఆవిష్కరణకు వచ్చిన సందర్భంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన హామీలను టీటీడీ నెరవేరుస్తోంది. చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పాలకమండలిలో శ్రీవారి ఆలయం నిర్మాణం పూర్తి అయింది. ఇప్పుడు తాళ్లపాకలో నిత్యం సంకీర్తనార్చన ఉండాలనే ఉద్దేశంతో కళామందిరం నిర్మితం చేస్తున్నారు. ఇది శుభపరిణామం.

– భూమన శంకర్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ సోదరుడు,నందలూరు

తాళ్లపాక అభివృద్ధికి మళ్లీ బీజం



పద కవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి అభివృద్ధికి మళ్లీ బీజం పడిందనే చెప్పవచ్చు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధి దిశగా పుంతలు తొక్కింది. మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో జన్మస్థలి అభివృద్ధి దిశగా టీటీడీ పాలకమండలి అడుగులు వేసింది.

– పీసీ యోగీశ్వరరెడ్డి, మాజీచైర్మన్, వ్యవసాయ మార్కెట్‌కమిటీ,రాజంపేట

జగనన్న ప్రభుత్వంలో అన్నమయ్య జన్మస్థలికి నూతనశోభ



జగనన్న ప్రభుత్వంలో పద కవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి నూతనశోభను సంతరించుకోనుంది. టీటీడీ చైర్మన్ భూమన నేతృత్వంలో పాలకమండలి తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకుంటోంది. అప్పుడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధి జరిగింది, జరుగుతోంది.

– చొప్పాఎల్లారెడ్డి, వైస్ చైర్మన్, ఏబీటీఎస్

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అమ్మఒడి మాకెంతో ఆసరా



మాది కాశినాయన మండలం కె.ఎస్.కొట్టాల గ్రామం. నా భర్త వ్యవసాయ పనులు చేస్తుంటాడు. మాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 5వ తరగతి, మరొకరు 3వ తరగతి చదువుతున్నారు. నా భర్త సంపాదనతోనే మా కుటుంబం గడవాలి. పిల్లల పోషణ, చదివించడం మాకు ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి కింద తల్లుల ఖాతాలో జమ చేస్తున్న రూ.15 వేలు మమ్మల్ని ఆదుకుంటోంది. ఈ సొమ్ము మాకు ఆసరాగా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ పథకం మాకు అండగా ఉండటంతో పిల్లలను బాగా చదివించుకుంటున్నాం. ఇప్పటికి మాకు మూడు దఫాలు అమ్మఒడి సాయం అందింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– దాదిబత్తిన నాగమ్మ, కె.ఎస్.కొట్టాల, కాశినాయన మండలం

సొంతింటి కల నెరవేరింది



మేము అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం, అనంతంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాము. అనంతంపల్లి జగనన్న కాలనీలో మాకు పక్కా గృహం మంజూరు చేశారు. జగనన్న ఇచ్చిన నగదుతోపాటు కష్టాన్ని జతజేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. అలాగే ప్రతినెల ఒకటో తేదీన నాకు రూ. 3 వేలు మా గ్రామ వలంటీర్ తెల్లవారకముందే ఇంటికి తెచ్చి ఇస్తున్నాడు. రేషన్ బియ్యం ఉచితంగా ప్రభుత్వం ఇస్తుంది. మా గ్రామానికి 104 ద్వారా వైద్య సేవలు కూడా అందుతున్నాయి. మేము కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాము. ఈ ప్రభుత్వం సాయంతో సంతోషంగా జీవించగలుగుతున్నాము. మరలా జగనన్న సీఎం అయితే మాలాంటి పేద వారి బతుకులు ఆనందంగా సాగుతాయి.

– తిరుమల రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు

ప్రభుత్వ ఆస్తులకు తాళాలు వేయడం చట్ట రీత్యా నేరం

మధ్యాహ్న భోజన ఏజెన్సీతో డీవైఈఓ

పెద్దతిప్పసముద్రం : చూడండమ్మా మీకు, మీ హెచ్ఎంల మధ్య ఏర్పడిన సమన్వయ లోపం కారణంగా మీరు పిల్లలపై కోపం చూపడం సరి కాదు. మీ వ్యక్తిగత సమస్యల కారణంగా 450 మంది పిల్లలు ఉన్న స్కూల్‌లో మంగళవారం మీరు ఆలస్యంగా భోజనం వండి పెట్టినందుకు నేను పై అధికారులకు సంజాయిషీ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. మీకు ఇష్టం లేకుంటే స్వచ్ఛందంగా తప్పుకోండి, మీ స్థానంలో కమిటీ సిఫారసుతో కొత్త వారిని నియమించుకుంటాం. అంతేగాని మీరు అయిష్టంగా పని చేయాల్సిన అవసరం లేదని మదనపల్లి డీవైఈఓ శ్రీరామ్ పురుషోత్తం మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఎదుట స్పష్టం చేశారు. మంగళవారం వంట గదికి తాళాలేసి ఆలస్యంగా భోజనం ఎందుకు వడ్డించాల్సి వచ్చిందో సమగ్రంగా ఆరా తీసేందుకు డీవైఈఓ బుధవారం మండల కేంద్రంలోని తెలుగు జెడ్పీ హైస్కూల్‌కు వచ్చారు. మధ్యాహ్న భోజన పథకం అమలు విధానాన్ని తనిఖీ చేశారు. అనంతరం వంట ఏజెన్సీ నిర్వాహకులతో చర్చించారు. ప్రభుత్వ ఆస్తులకు తాళం



వంట ఏజెన్సీ నిర్వాహకులతో చర్చిస్తున్న డీవైఈఓ శ్రీరామ్ పురుషోత్తమ్

వేయడం చట్టరీత్యా నేరమని మీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. తమకు బిల్లులు సక్రమంగా రావడం లేదని, వచ్చే నెల 2వ తేదీ వరకు మాత్రమే తాము భోజనం వండుతామని నిర్వాహకులు చెప్పారు. దీంతో తక్షణం డీవైఈఓ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఫోన్ చేసి సదరు పాఠశాలలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు. పేరెంట్స్ కమిటీని ఏర్పాటు చేసి వారి సిఫారసు మేరకు కొత్త వారిని నియమించి మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం సక్రమంగా అమలయ్యేలా చూడాలని హెచ్ఎం అపర్ణాదేవిని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ ఉన్నారు.

బార్లపల్లె రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

- మూడురోజుల చికిత్స తర్వాత బ్రెయిన్‌డెడ్
- ఆరుకు చేరిన ప్రమాద మృతుల సంఖ్య

మదనపల్లె : మండలంలోని బార్లపల్లె వద్ద నాలుగురోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హరీష్ చికిత్స పొందుతూ, బ్రెయిన్ డెడ్ కావడంతో బుధవారం తుదిశ్వాస విడిచాడు. మద్యం మత్తులో స్కార్పియో వాహనాన్ని వేగంగా నడుపుతూ... ఎదురుగా వచ్చిన కార్లను ఢీకొనడమే కాకుండా, ఇద్దరు అమాయక పాడిరైతులను బలిగొని, తర్వాత కొద్దిసేపటికే బోరులారీని ఢీకొని వాహనంలోనే డ్రైవర్‌తో కలిపి ముగ్గురు, మొత్తం ఐదు మంది ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. అయితే ప్రమాదంలో తీవ్రగాయాలతో బయటపడిన హరీష్, చరణ్, మహేష్‌లలో హరీష్, చరణ్‌ల తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలో ఉన్న వారిద్దరినీ తిరుపతి, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. మహేష్‌కు ప్రమాదంలో రెండుచేతులు విరిగిపోవడంతో జిల్లా ఆస్పత్రిలోనే చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం డిశ్చార్జి చేశారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి వెళ్లిన హరీష్‌కు మరుసటిరోజే బ్రెయిన్‌డెడ్ అయి, చికిత్సకు స్పందించకపోవడంతో మదనపల్లెకు తీసుకువచ్చారు. ఇక్కడ డాక్టర్ల పర్యవేక్షణలో ఉంటూ, బుధవారం ప్రాణాలు విడిచాడు. పట్టణంలోని రామారావు కాలనీ గౌతమీనగర్‌కు చెందిన



భార్య, పిల్లలతో హరీష్ (ఫైల్ ఫొటో)



హరీష్ మృతదేహం

నాగరాజు, రెడ్డెమ్మ దంపతుల కుమారుడైన గుండ్లపల్లి హరీష్(31)కు వివాహమైంది. భార్య మల్లీశ్వరి, ఏడేళ్ల కుమార్తె హేమశ్రీ, నాలుగేళ్ల కుమారుడు గగన్ ఉన్నారు. చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్న హరీష్‌కు స్థలం విషయంలో స్కార్పియో యజమాని సుంకర విక్రమ్ పరిచయమయ్యాడు. హరీష్, తన స్నేహితులైన తిలక్, శ్రీనాథ్, చరణ్‌ల సహాయంతో స్థల వివాదాన్ని పరిష్కరించడంతో.. సుంకర విక్రమ్ పార్టీ చేసుకుందామని, కర్నాటక రాయల్పాడుకు వెళ్లడం, అక్కడ మద్యం సేవించి, తిరుగుప్రయాణంలో మదనపల్లెకు వస్తూ...బార్లపల్లె వద్ద రోడ్డు ప్రమాదం బారిన పడ్డారు. ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ముగ్గురిలో హరీష్ బుధవారం కన్నుమూశాడు. చరణ్‌కు బెంగళూరులో సర్జరీ జరిగింది. చికిత్స పొందుతున్నాడు. జిల్లా ఆస్పత్రిలో వైద్యులు బుధవారం హరీష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం లక్ష్యం

– ఎమ్మెల్యే కొరముట్ల, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్ రెడ్డి

ఓబులవారిపల్లె (పెనగలూరు) : రాష్ట్రంలో మహిళలను అభివృద్ధి పథంలో నడిపించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో 60 మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో టైలరింగ్ వలన ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళల పేరుమీద కోట్లాది రూపాయలు వారి ఖాతాలలో జమ చేశారన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి మాట్లాడుతూ టైలరింగ్ వలన మహిళలు స్వశక్తితో తమ కాళ్ల మీద తాము నిలబడగలరన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో–ఆర్డినేటర్ నిరంజన్, జెడ్పీటీసీ ఉదయగిరి సుబ్బరాయుడు, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, డీఆర్‌డీఏ అధికారి పార్థసారథి, డ్వాక్రా మహిళలు, కట్టావారిపల్లి సర్పంచ్ బాలు మనోహరమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యపూజస్వామి మహాశివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ

సిద్దవటం : నిత్యపూజ స్వామి మహాశివరాత్రి–2024 వాల్ పోస్టర్‌ను బుధవారం సిద్దవటం మడల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలం, వంతాటిపల్లె గ్రామ సమీంలోని లంకమల్ల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి కోనలో మార్చి 7వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పాటూరి కొండారెడ్డి, వంతాటిపల్లి సర్పంచ్ ప్రతినిధి కొంగా లక్ష్మీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలం క్రిష్ణచైతన్య, ఆలయ సిబ్బంది చంద్ర, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

అజాగ్రత్తగా పొగతాగడంతో గడ్డివామి దగ్ధం

మదనపల్లె : పొగతాగిన ఓ వ్యక్తి తుంటను నిర్లక్ష్యంతో, ఏమరుపాటుగా పడేయడంతో గడ్డివామి దగ్ధమై రూ.10వేలు ఆస్తినష్టం కలిగిన సంఘటన బుధవారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచాయతీ ఆర్బీఓ కార్యాలయ సమీపంలోని పుంగనూరువాండ్లపల్లెలో జరిగింది. మధ్యాహ్నం.12.30 గంటల సమయంలో గడ్డివామి కాలుతోందన్న సమాచారం మేరకు ఫైర్ ఆఫీసర్ జి.శివప్ప ఆధ్వర్యంలో సిబ్బంది విజయ్, హమీద్, రెడ్డిశేఖర్, రాజేంద్రలు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. మంటలను పూర్తిగా ఆర్పివేసి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో సుమారుగా రూ.10వేల నష్టం వాటిల్లిందని, అయితే అధికారులు వెంటనే స్పందించడంతో..రూ.20 వేల ఆస్తిని రక్షించినట్లు యజమాని రాజేష్ తెలిపారు.

జిల్లా ఆస్పత్రికి రూ.30లక్షల వైద్య పరికరాల అందజేత

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి గోకుల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.30లక్షల విలువచేసే వైద్యపరికరాలు, తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను అందజేశారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలోని డైక్ భవనంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్.జి.బాబు, ప్రిన్సిపాల్ జమున, ఆర్ఎంఓ ప్రసాదరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోకుల్‌దాస్ ఛారిటబుల్ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎస్వీ మల్లికార్జున, డీజీఎం మహంతేష్‌బంగారి మాట్లాడుతూ... మదనపల్లె ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఇంటర్నేషనల్ క్లాతింగ్ కంపెనీ ఆధ్వర్యంలో సమాజసేవలో భాగంగా కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ నిధులు రూ.30లక్షలు వెచ్చించి,



గోకుల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ ఛారిటబుల్ ఫౌండేషన్ నుంచి వైద్యపరికరాలను స్వీకరిస్తున్న వైద్యులు

జిల్లా ఆస్పత్రికి అవసరమైన వైద్యపరికరాలు, ఆర్వో ప్లాంటు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గోకుల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ ఛారిటబుల్ ఫౌండేషన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సరస్వతమ్మ, హెచ్ఆర్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, ఫ్యాక్టరీ మేనేజర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లకోసారి జన్మదినం.. మరపురాని ఆనందం

గుర్రంకొండ : ఫిబ్రవరి 29 తేదీన మాపాప అక్షయ పుట్టడం మా అదృష్టంగా భావిస్తున్నాం. అందరిలా కాకుండా నాలుగేళ్ల కొకసారి మా పాప జన్మదినం జరుపుకోవడం ఆనందంగా ఉంటుంది. మాప 2012 ఫిబ్రవరి 29 న గుర్రంకొండలో జన్మించింది. ఆరోజు మాకు నిజంగా ప్రత్యేకమైన రోజే. గుర్రంకొండ పట్టణంలో ఈరోజున పుట్టింది మా పాప ఒక్కటే కావడం గర్వంగా ఉంది. మాపాప పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు మూడు జన్మదిన వేడుకలు జరుపుకొన్నాం. 2012, 2016, 2021లో మూడు మార్లు, మళ్లీ ఇప్పుడు నాల్గవసారి జన్మదిన వేడుకలు నిర్వహించుకుంటున్నాం. 2021లో మా బంధువులు, మిత్రులు, శ్రేయాభిలాషులందరిని పిలిపించి పాప జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నాం. ఈసారి కూడా మూడు కిలోల బర్త్‌డే కేక్ తెప్పించి మా వీధిలోని పిల్లలందరి సమక్షంలో ఘనంగా జరుపుకోవడానికి సన్నాహాలు చేసుకొంటున్నాం. ప్రతి ఏడాది అందరూ జన్మదిన వేడుకలు జరపుకోవడం సాధారణం. అయితే నాలుగేళ్ల కొకసారి జన్మదినం జరుపుకోవడం ప్రత్యేకంగా ఉంది. ఇది చాలా అరుదుగా జరిగే సంఘటన. ఎంత మందికి ఇలాంటి అదృష్టం వరిస్తుంది. చిన్నవయస్సులో అందరిలాగానే నా బర్త్‌డే ఎప్పుడు అని మా పాప మారాం చేసేది. ఊహ తెలిసిన తరువాత నాలుగేళ్ల కొకసారి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడంతో ఇలాగే బాగుంటుందని సంబరపడిపోతుంటుంది. బయటగానీ, పాఠశాలల్లోగానీ లీపు సంవత్సరం అంటే మా పాప పుట్టిన రోజే గుర్తుకురావడం సంతోషంగా ఉంటుంది.



తల్లిదండ్రులతో చిన్నారి అక్షయ

పంటకు నీటి మళ్లింపు విషయంలో ఘర్షణ

- మహిళపై కొడవలితో దాడి
- ముగ్గురికి గాయాలు



జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్రకళను విచారిస్తున్న ఎస్ఐ మోహన్‌నాయక్

మదనపల్లె : పంట పొలానికి నీటి మళ్లింపు విషయంలో జరిగిన ఘర్షణలో.. ఓ మహిళపై కొడవలితో దాడిచేయడంతో పాటుగా, ముగ్గురు గాయపడ్డ సంఘటన బుధవారం మదనపల్లె మండలం కొండామర్రిపల్లె, ఇసుకనూతిపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు(50), ఆయన భార్య చంద్రకళ(45) తమ పొలానికి తీరువ నీటిని మళ్లిస్తుండగా, అదే గ్రామానికి చెందిన హేమంత్, మన్నెమ్మలు నీటిని పంటకు మళ్లించవద్దంటూ గొడవకు దిగారు. ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో ఆగ్రహించిన ప్రత్యర్థులు హేమంత్, మన్నెమ్మలు కొడవలితో చంద్రకళ, శ్రీనివాసులు దంపతులపై దాడికి తెగబడ్డారు. దాడిని అడ్డుకోబోయిన మరో రైతు నారాయణస్వామిపైన దాడి చేశారు. దీంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘర్షణ సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఆస్పత్రిలో బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ నాయక్ తెలిపారు.